సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం ; 27 ; డిసెంబర్ ; 2023



పెద్దవాగులో చెత్త డంపింగ్
ఆలేరు మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను పెద్దవాగులో డంపింగ్ చేస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. - 9లో



కాళీయమర్దనుడిగా ఊరేగి..
యాదాద్రి అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారు చిన్నికృష్ణుడిగా, కాళీయ మర్దనుడిగా దర్శనమిచ్చారు. - 10లో



శోకసంద్రంలోనే తండాలు
ఒకే కుటుంబానికి చెందిన నలుగురు, బంధువు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తండాల్లో విషాదం అలుముకుంది. - 10లో

న్యూస్‌రీల్

వైభవంగా దత్త మహాయాగం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న ప్రభూజీ

బొమ్మలరామారం : మండలంలోని పెద్దపర్వతాపూర్‌లో గల శ్రీ సాయిధామం సేవాశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతి రామానంద ప్రభూజీ ఆధ్వర్యంలో మంగళవారం దత్త మహాయాగం వైభవంగా నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, స్వస్తి వాచనం, అఖండ దీపా స్థాపనం, శ్రీగురుపూజ, గోపూజ, దత్తాత్రేయ స్వామికి పంచామృత అభిషేకాలు, హోమం తదితర పూజలు నిర్వహించారు. లోకకళ్యాణం కోసం 108 గుండాల్లో హోమం నిర్వహించినట్లు ఆశ్రమ పీఠాధిపతి శ్రీ రామానంద ప్రభూజీ తెలిపారు. ఈ సందర్భంగా స్వామి దుర్గానందపూరి మహారాజ్ మంగళశాసనాలు అందజేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నాగిరెడ్డి

ఆలేరురూరల్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆలేరు మండలంలోని కొలనుపాక, రాఘవాపురం గ్రామాల్లో ప్రజలకు మంగళవారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ నాగిరెడ్డి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ రాహుల్ మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా జనవరి 25వ తేదీ వరకు కేంద్ర పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిఉండి పథకాలు అందని వారిని గుర్తించి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషన్ డీఆర్‌డీఓ జోజప్ప, సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, వికాస్ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ, ఎంపీడీఓ జ్ఞానప్రకాష్, ఎంపీఓ సలీం, రామకృష్ణ, మీనా తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరాముడి అక్షింతలు పంపిణీ



అక్షింతల కలశాలతో ఆలయ కమిటీ సభ్యులు

అడ్డగూడూరు : అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలు, ఆహ్వాన పత్రాలను అడ్డగూడూరులోని శ్రీ కోదండ రామస్వామి ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తులకు పంపిణీ చేశారు. జనవరి 15వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి అక్షింతలను అందజేయనున్నట్లు శ్రీకోదండ రామస్వామి ఆలయ కమిటీ సభ్యుడు కంబాలపల్లి కిష్టయ్య తెలిపారు. అంతకుముందు అక్షింతలను కోదండ రామాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పునూతల నర్సింహారెడ్డి, కూరాకుల వెంకటన్న, తోట మురళీ, సోమిరెడ్డి మాధవరెడ్డి, తుమ్మల పురుషోత్తంరెడ్డి, గంగరాజు, మద్ది సత్తయ్య, హరిప్రసాద్, ఆలయ అర్చకుడు వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు..

నల్లగొండ : నల్లగొండ జిల్లాలోని మైనార్టీ గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి టి.విజయేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో పీసీఈ, సెక్యూరిటీ గార్డులు, హౌస్ కీపింగ్ పోస్టుల కోసం స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థుల అనుభవం ఆధారంగా మెరిట్ జాబితా తయారు చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో, రీజనల్ లెవల్ కోఆర్డినేటర్ కార్యాలయం-నల్లగొండ, హెచ్-కంప్యూటర్ ఏజెన్సీ నల్లగొండలో ఈ నెల 29తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

పేదల సంక్షేమమే లక్ష్యం



ప్రజాపాలన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పక్కన ఉత్తమ్, కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

ఆరు గ్యారంటీల అమలుకే 'ప్రజాపాలన'
- 28వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరించాలి
- సన్నాహక సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- హాజరైన మంత్రులు వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు




మాట్లాడుతున్న ఉత్తమ్, కోమటిరెడ్డి

నల్లగొండ : పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు జరుగనున్న ప్రజాపాలన కార్యక్రమ సన్నాహకాల్లో భాగంగా నల్లగొండలోని ఎంఎన్ఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం జిల్లాకు చెందిన నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామ, వార్డు సభల సందర్భంగా ఆరు గ్యారంటీలకు సంబంధించి ప్రజలు ఇచ్చే దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. దరఖాస్తులు నింపేందుకు.. స్వీకరణకు హెల్ప్ డెస్కులు, ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రద్దీ ఎక్కువగా ఉంటే బృందాల సంఖ్య పెంచాలన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నాం : మంత్రి ఉత్తమ్
రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ప్రభుత్వ ఉద్దేశాలను నెరవేర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రూ.పది లక్షలకు ఆరోగ్యశ్రీ పెంపు అమలు చేశామన్నారు. రూ.500కు గ్యాస్ సిలిండర్ ఇచ్చే కార్యక్రమం త్వరలో మొదలు పెడతామన్నారు. ప్రజా పాలనలో స్వీకరించే దరఖాస్తుల ఆధారంగానే ఆరు గ్యారంటీల అమలు అవుతాయని చెప్పారు. గత ప్రభుత్వంలో నీటిపారుదల శాఖలో జిల్లాకు అన్యాయం జరిగిందని పదేళ్లలో ఒక్క ఎకరాకు కూడా అదనంగా నీరందలేదన్నారు. ఈ ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తుందన్నారు. రేషన్ బియ్యం రీసైక్లింగ్ మాఫియాను కఠినంగా శిక్షిస్తామన్నారు. రేషన్ సరఫరాను ప్రక్షాళన చేస్తామన్నారు.

తెలంగాణ పునర్నిర్మాణంలో పాలుపంచుకోవాలి : మంత్రి కోమటిరెడ్డి
రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాలసీలను పేదలకు అందే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. ప్రజాపాలన సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా టెంట్లు, మంచినీటి సౌకర్యం, కుర్చీలు, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. అధికారులు బాధ్యతాయుతంగా పని చేసి తెలంగాణ పునర్నిర్మాణంలో పాలు పంచుకోవాలన్నారు. బెల్టు షాపులు, గంజాయి అమ్మకాలపై పోలీసులు శ్రద్ధ పెట్టాలని, ఇసుక, గంజాయి, వైన్ మాఫియాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి జరిగే ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించి గ్రామాలు, పట్టణాల్లో 151 బృందాలను ఏర్పాటు చేశామని, సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సీహెచ్.ప్రియాంక మాట్లాడుతూ జిల్లాలో 58 టీమ్‌లు ఏర్పాటు చేసామని, దరఖాస్తుల స్వీకరణకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతు కె.జెండగే మాట్లాడుతూ జిల్లాలో పక్కా ఏర్పాట్లతో ప్రజా పాలన విజయవంతానికి సిద్ధంగా ఉన్నామని, మొత్తం 51 టీమ్‌లతో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బాలునాయక్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, మందుల సామేల్, నలమాద పద్మావతి, నల్లగొండ ఎస్పీ అపూర్వరావు, యాదాద్రి డీసీపీ రాజేష్‌చంద్ర, సూర్యాపేట ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, భాస్కర్ రావు, వెంకట్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా అధికారులు

పూర్తికాని పాఠ్య ప్రణాళిక

- సమీపిస్తున్న పదో తరగతి పరీక్షలు
- డిసెంబర్ ముగుస్తున్నా 75 నుంచి 90 శాతమే పూర్తి
- విద్యార్థుల్లో ఆందోళన



భువనగిరి : పదో తరగతి పరీక్షలకు సమయం ముంచుకొస్తోంది. మార్చి మూడో వారంలో పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. ఇప్పటి వరకు పాఠ్యప్రణాళిక పూర్తి కాలేదు. ఏటా డిసెంబర్ నాటికి పాఠ్యాంశాలు పూర్తిచేసి విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధులను చేసేందుకు చేయవలసి ఉంటుంది. కానీ, ఈ విద్యా సంవత్సరం వివిధ కారణాలతో పాఠ్యాంశాల బోధన ఇంకా పూర్తి కాలేదు. కొన్ని పాఠశాలల్లో 75 శాతం నుంచి 90 శాతం వరకు పూర్తయ్యింది. జనవరి రెండో వారం వరకు సిలబస్ పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. జిల్లాలో 712 పాఠశాలలు ఉండగా ఇందులో 5,546 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంసిద్ధులు అవుతున్నారు.

బోధనకు అటంకం
వివిధ కారణాలతో బోధనకు అటంకం ఏర్పడటంతో విద్యార్థులు నష్టపోయారు.ఈ విద్యాసంవత్సరంలో అక్టోబర్ 5 నుంచి 11వ తేదీ వరకు సంగ్రహణాత్మక మూల్యాంకనం(ఎస్ఏ-1) పరీక్షలు నిర్వహించారు. అవి పూర్తికాగానే దసరా సెలవులు రావడంతో బోధనపై ప్రభావం ఏర్పడింది. సెప్టెంబర్‌లో ఉపాధ్యాయులు బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేయడంతో బోధనపై ప్రభావం పడింది. జీహెచ్ఎంల బదిలీల ప్రక్రియ ముగిసి పదోన్నతులు చేపట్టే సమయంలో కోర్టు కేసులతో మరోసారి ఆటంకం ఏర్పడింది. అంతలోనే ఎన్నికల షెడ్యూల్ రావడంతో మళ్లీ బోధనపై ప్రభావం పడింది.ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారికి డిసెంబర్ 1న ప్రత్యేక సెలవు ప్రకటించారు. డిసెంబర్ 2 నుంచి పాఠ్యాంశ బోధన గాడినపడింది.ప్రస్తుతం ప్రత్యేక శ్రద్ధ పెట్టి బోధన చేస్తున్నారు. ఇంతలోనే ఉన్నతి, లక్ష్యం కార్యక్రమాలతో పాటు కాంప్లెక్స్‌ల పరిధిలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ఉపాధ్యాయులు బోధనకు దూరం అయ్యారు. ఈ నెలలో క్రిస్మస్ సెలవులు పూర్తి కాగా , జనవరి మొదటి వారం తర్వాత సంక్రాంతి సెలవులు ప్రారంభం కానున్నాయి. ఈ సెలవులు బోధనపై ప్రభావం చూపనున్నాయి.

కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు
పదో తరగతి విద్యార్థులకు గత నెల నుంచే ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఏయే పాఠశాలల్లో సిలబస్ పూర్తి కాలేదో ఆయా పాఠశాలల్లో త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందు కోసం పాఠశాలల వారీగా పర్యవేక్షిస్తున్నారు. సిలబస్ పూర్తిచేసి పునశ్చరణ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకునే పనిలో నిమగ్నులయ్యారు.

సిలబస్ పూర్తికాని పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ
పదో తరగతి విద్యార్థులకు ఈ నెలాఖరు వరకు సిలబస్ పూర్తి చేయవల్సి ఉంది. చాలా పాఠశాలల్లో 100 శాతం సిలబస్ పూర్తయ్యే అవకాశం ఉంది. ఎద్దైనా పాఠశాలలో సిలబస్ పూర్తి కాకుండా ఉంటే వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. ఇందుకోసం త్వరలోనే సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తాం.
-ప్రశాంత్‌రెడ్డి, ఇంచార్జ్ డీఈఓ

నేడు కలెక్టర్‌ను కలవనున్న కౌన్సిలర్లు!

- చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నోటీసు ఇచ్చే అవకాశం



క్యాంపులో బీఆర్ఎస్ కౌన్సిలర్లు

భువనగిరిటౌన్ : మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్యపై అవిశ్వాసానికి రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. అసమ్మతి కౌన్సిలర్లు బుధవారం కలెక్టర్‌ను కలిసి సంతకాలతో తీర్మానపత్రాన్ని అందజేయనున్నట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానం కోరుతూ 16 మంది సభ్యులు సంతకాలు చేసినట్లు ఓ బీఆర్ఎస్ కౌన్సిలర్ తెలిపారు. మంగళవారం భువనగిరి శివారులో కాంగ్రెస్, బీజేపీకు చెందిన కౌన్సిలర్లు సమావేశమై తీర్మాన పత్రంపై సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా 16 మంది కౌన్సిలర్లు హైదరాబాద్ క్యాంపులోనే ఉన్నారు.

పేదల పక్షాన అలుపెరగని పోరాటం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

చౌటుప్పల్ : పేదల పక్షాల సీపీఐ అలుపెరగని పోరాటాలు చేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. చౌటుప్పల్‌లో మంగళవారం నిర్వహించిన సీపీఐ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమం నుంచి ఎన్నో పోరాటాలు నిర్వహించిన ఘనత సీపీఐదన్నారు. ఆయా పోరాటాల్లో ఎంతో మంది కార్యకర్తలు ప్రాణాలు అర్పించారని తెలిపారు. భవిష్యత్‌లోనూ ప్రజాసమస్యలపై పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చౌటుప్పల్ మండల, పట్టణ కార్యదర్శులు పల్లె శేఖర్‌రెడ్డి, పగిళ్ల మోహన్‌రెడ్డి, నాయకులు కొండూరు వెంకటేశ్, పిల్లి శంకర్, అంజయ్య, రామలింగం, రాములు, సుధాకర్, యాదయ్య, శంకరయ్య, నర్సింహ్మా, భాస్కర్, మంకులు, యాదయ్య, కృష్ణ, భిక్షపతి, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోజూ 4 వార్డుల్లో సభలు

భువనగిరిటౌన్ : భువనగిరిలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మున్సిపాలిటీలో 35 వార్డులు, 78వేలకు పైగా జనాభా ఉంది. రోజూ నాలుగు వార్డుల్లో సభలు నిర్వహించనున్నారు. ఇందుకోసం నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారి, మున్సిపల్ మేనేజర్, డిప్యూటీ ఇంజనీర్ నేతృత్వంలో టీంలను సిద్ధం చేశారు. వీరికి మరో ఐదుగురు సహాయకులు ఉంటారు. ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. వీటితో పాటు ఇతర సమస్యలపైనా దరఖాస్తులు స్వీకరించి సాధ్యమైన వాటిని అక్కడికక్కడే పరిష్కరించనున్నారు. దరఖాస్తు ఫారాలను అధికారులే ఉచితంగా అందజేస్తారని, జిరాక్స్ సెంటర్ల వద్ద తీసుకోవద్దని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి ప్రజలకు సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న రాహుల్ కాశ్యాప్

భువనగిరి రూరల్ : కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర రూరల్ డెవలప్మెంట్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ రాహుల్ కాశ్యాప్ కోరారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం భువనగిరి మండలం జమ్మాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుతీరుపై తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులందరికీ చేరాలన్నది తమ లక్ష్యమన్నారు.సుకన్య సమృద్ధి యోజన, అటల్ పెన్షన్ పథకం, కిసాన్ పెట్టుబడి, ఉజ్వల్ పథకాలు తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లెడ్ స్క్రీన్ ద్వారా ప్రధానమంత్రి సందేశాన్ని వినిపించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామకష్ణ, నాబార్డ్ అధికారి వినయ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ మేనేజర్, స్వయం సహాయక సంఘాలు, ఐకేపీ, సెర్ప్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరికి ఊరట.. పత్తికి దెబ్బ

- 2022-23లో రైతన్నకు మిశ్రమ ఫలితాలు
- సాగునీటి సౌలభ్యం, ఉచిత కరెంట్‌తో పెరిగిన వరి సాగు
- ఆసరాగా రైతుబంధు సాయం
- పత్తి రైతును వీడని కష్టాలు
- సరైన వర్షాలు కురువక, తెగుళ్లతో తగ్గిన దిగుబడి
- గిట్టుబాటు కాని మద్దతు ధర

2023 రివైండ్

సాక్షి యాదాద్రి : 2022-23 సంవత్సరం జిల్లా రైతుకు మిశ్రమ ఫలితాలు అందించింది. ఉచిత విద్యుత్, సాగునీరు సమృద్ధిగా లభించడం, స్థానికంగానే ధాన్యం కొనుగోళ్లతో రైతులు వానాకాలం, యాసంగి సీజన్‌లలో వరి సాగుకు మొగ్గు చూపారు. పత్తి రైతుకు ఈఏడూ నష్టాలు తప్పలేదు. ప్రతికూల వాతావరణం, తెగుళ్ల కారణంగా చేలు దెబ్బతిని దిగుబడిపై ప్రభావం చూపింది. మరోవైపు రైతులు ఎరువుల కొరత ఎదుర్కొన్నారు. రైతుబంధు పథకం అన్నదాతకు ఆసరాగా నిలిచింది. రుణమాఫీ పూర్తిగా జరగలేదు.

వరికి అనుకూలించిన అంశాలివే..
సాగునీరు సమృద్ధిగా ఉండడం, ఉచిత విద్యుత్, స్థానికంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం అన్నదాతకు కలిసొచ్చింది. బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట, భువనగిరి, మోత్కూరు మండలాల్లో మూసీ జలాలతో సాగు విస్తీర్ణం పెరిగింది. తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాల్లో కొన్ని చెరువులను గోదావరి జలాలతో నింపడంతో భూగర్భ నీటి మట్టం గణనీయంగా పెరిగింది. దీనికి తోడు వర్షాలు సమృద్ధిగా కురిశాయి.నీటి సౌలభ్యత పెరడగతో పాటు ఉచిత విద్యుత్ కొత్తగా ఆయకట్టు పెరిగింది. నాన్ ఆయకట్టులోనూ సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ వానాకాలంలో 30,196 మంది రైతుల నుంచి 2.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అయితే ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర గిట్టుబాటు కాలేదు. సన్నాలకు మాత్రం మద్దతు ధర లభిస్తోంది.



వలిగొండ మండలం సంగెం సమీపంలో మూసీ జలాలతో సాగైన వరి



అదునుకు వర్షాలు లేకపోవడంతో వలిగొండ సమీపంలో ఎదగని పత్తి చేను (ఫైల్)

2022-23లో పంటల సాగు ఇలా..

సీజన్	వరి	పత్తి	ఇతర పంటలు
వానాకాలం	3,00,190	1,11,038	8,661
యాసంగి	2,90,546	1,95,88	2023-24
వానాకాలం	3,04,965	1,02,365	7,296

అందరికీ అందని పెట్టుబడి సాయం
జిల్లాలో రైతుబంధు లబ్ధిదారులు 2,71,1979 మంది రైతులు ఉన్నారు. వీరి ఖాతాల్లో రూ.304.85 కోట్లు జమ కావల్సి ఉంది. ప్రస్తుత యాసంగి సీజన్‌కు సంబంధించి రైతులందరి ఖాతాల్లో నగదు జమ కాలేదు. పెట్టుబడి సాయం డబ్బుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

పత్తి రైతు చిత్తు
కాలం కలిసిరాకపోవడంతో పత్తి రైతు నష్టాలను చవిచూశాడు. దీనికి తోడు పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. విత్తనాలు విత్తిన సమయంలో సరైన వర్షాలు రాలేదు. ఆ తర్వాత పూత, కాత వచ్చే సమయంలో వర్షాలు మళ్లీ వెనుకపట్టు పట్టాయి. దీంతో చేలు ఎదగలేదు. దీనికి తోడు తెగుళ్లు కూడా సోకడంతో దిగబడిపై ప్రభావం చూపింది. ఎకరాకు గరిష్టంగా 5 క్వింటాళ్లకు మించి రాలేదు. అంతేకాకుండా సీసీఐ ప్రకటించిన మద్దతు ధర గిట్టుబాటు కాలేదు.

కొందరికే పంట పరిహారం
2022-23 సంవత్సరంలో కురిసిన అకాల వర్షాలకు జిల్లాలో సుమారు 6,470 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. కానీ, రూ.7.49 కోట్ల పరిహారం మాత్రమే రైతులకు చెల్లించారు.


వడ్డీ కింద రుణమాఫీ డబ్బులు జమ
2018 డిసెంబర్ నాటికి బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులకు గత ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో 59,726 మంది రైతులకు గాను రూ.364.75 కోట్లు మాఫీ అయ్యాయి. అయితే మాఫీ డబ్బులను బ్యాంకర్లు వడ్డీ కింద జమ చేశారని రైతులు చెబుతున్నారు.

వరి లాభసాటిగానే ఉంది



నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను. మొత్తం రూ.80 వేల వరకు ఖర్చు వచ్చింది. వడ్లను అమ్మితే రూ.1,50,000 వచ్చాయి. ఈసారి వరి లాభసాటిగానే ఉంది. సాగు నీరు, ఉచిత కరెంట్ ఇందుకు కారణం. నాట్లు వేసే సమయంలో మాత్రం కూలీలు, ఎరువుల కొరత ఎదురైంది. అయినా లాభం వచ్చింది.
-తాళ్ల ఉప్పల్‌రెడ్డి, గుండ్లపల్లి, యాదగిరిగుట్ట

పత్తి వేసి నష్టపోయాను



ఐదు ఎకరాల్లో పత్తి వేశాను. రూ.2లక్షల వరకు దిగుబడి వచ్చింది. ఎకరానికి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అదునుకు వర్షాలు కురువలేదు. కూలీలు కొరత కూడా ఉండడంతో ఎక్కువ కూలి చెల్లించవలసి వచ్చింది. పత్తి సాగు ఏమాత్రం ప్రయోజనం లేదు. ఈఏడూ నష్టాలే మిగిలాయి.
-ఆసర్ల ఐలయ్య, బాహుపేట, యాదగిరిగుట్ట

ఎరువుల కొరత
ఈ వానాకాలం 58,346 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా అందుబాటులో ఉంచడంలో అధికారులు విఫలయ్యాయి. యూరియా1,1391, డీఏపీఓ 1,312 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 4,992 మెట్రిక్ టన్నులు, ఇతర ఎరువులు 1,028 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చాయి.

క్లుప్తంగా

వివిధ కేసుల్లో పలువురికి జరిమానా

హుజూర్‌నగర్ : మద్యం సేవించి వాహనాలు నడపడం.. పేకాడ ఆడుతూ పోలీసులకు పట్టుబడం.. ఘర్షణలు తదితర కేసుల్లో పలువురికి రూ.70,500ల జరిమానా విధిస్తూ హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్ మంగళవారం తీర్పు వెలువరించారు. ఒక్క రోజులోనే 60 కేసుల్లోని నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. వారు తమ నేరాలను అంగీకరించడంతో న్యాయమూర్తి జరిమానా విధించారు. జరిమానా డబ్బులు ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని జడ్జి తీర్పుల్లో పేర్కొన్నారు.




నల్లగొండలో జరిగిన ప్రజాపాలన సన్నాహక సమావేశానికి వచ్చిన జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు స్వాగతం పలుకుతున్న నల్లగొండ ఇంచార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, సూర్యాపేట ఇంచార్జి కలెక్టర్ ప్రియాంక



జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి



హాజరైన ఎమ్మెల్యేలు జయవీర్ రెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి, బీఎల్ఆర్, బాలునాయక్, వేముల వీరేశం తదితరులు




జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాటామంతి



మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు

- నిడమనూరు మండలంలో 8 కి.మీ దూరంలోనే 9మలుపులు
- రహదారిని విస్తరించినా ఆగని ప్రమాదాలు
- పుష్కర కాలం క్రితం బొక్కమంతులపహాడ్ సమీపంలో 14మంది బలి
- తాజాగా ఆరుగురి మృతితో హడలిపోతున్న ప్రయాణికులు

నిడమనూరు : రహదారి మూలమలుపులు ప్రయాణికులను కబళించేస్తున్నాయి. వాహనాల రద్దీ పెరగడంతో కేంద్ర ప్రభుత్వం కోదాడ–జడ్చర్ల రోడ్డును జాతీయ రహదారి–167గా అభివృద్ధి చేసింది. అయినా, ప్రమాదాలకు అడ్డుకట్ట పడడం లేదు. నిడమనూరు మండలం మీదుగా వెళ్లే ఈ రహదారిపై కేవలం 8 కి.మీ దూరంలోనే ఉన్న బొక్కమంతులపహాడ్–వేంపాడ్–వెంగన్నగూడెం స్టేజీల మధ్య 9 మూలమలుపులు ఉన్నాయి. తాజాగా, మండలంలోని వేంపాడ్, మూడో నంబర్ కెనాల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాలతో ఈ రహదారి గుండా వాహనదారులు ప్రయాణించాలంటేనే హడలిపోతున్నారు.

పుష్కర కాలం క్రితం 14మంది మృతి..

» 2012 జూలై 24న దేవరకొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న లారీ నిడమనూరు మండలంలోని బొక్కమంతులపహాడ్ సమీపంలో జీవాలను తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో 14మంది మృతిచెందగా మరో 23మంది గాయపడ్డారు.

» బొక్కమంతులపహాడ్ సమీపంలోనే గతంలో మిర్యాలగూడ నుంచి దేవరకొండ వైపు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి కాలువలో పడిపోయింది. ఈ ప్రమాదంలో జీవాలను కొని విక్రయించే వ్యాపారులు ఆరుగురు సిమెంట్ బస్తాల కింద పడి విగతజీవులుగా మారారు.

» 1997లో వేంపాడ్ స్టేజీ సమీపంలో మూలమలుపు వద్ద ఖమ్మం నుంచి సాగర్‌కు వెళ్తున్న స్కూల్ పిల్లల జీపును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టిన ఘటనలో నలుగురు బాలికలు మృతిచెందగా మరికొంత మంది గాయాలపాలయ్యారు.



బొక్కమంతులపహాడ్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు (ఫైల్)

» అంతేకాకుండా ఇదే రోడ్డులో గతంలో ఇరుకు వంతెనలు, రోడ్డుపై వాహనాల రద్దీ కారణంగా ఒకరిద్దరు రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన ఘటనలు అధికంగానే ఉన్నాయి.

కొన్ని చోట్ల డివైడర్లు లేక..

కేంద్ర ప్రభుత్వం కోదాడ–జడ్చర్ల రోడ్డును జాతీయ రహదారి–167గా అభివృద్ధి చేసింది. రోడ్డు విశాలంగా ఉందని వాహనదారులు స్పీడుగా వెళ్తుండడం, కొన్ని చోట్ల డివైడర్లు లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఆదివారం రాత్రి, సోమవారం తెల్ల వారుజామున వేంపాడ్ స్టేజీ వద్ద, మూడో నంబర్ కెనాల్ సమీపంలో రోడ్డుపై డివైడర్లు లేకపోవడంతోనే ప్రమాదాలు జరిగినట్లు తెలుస్తోంది. రోడ్డుకు ఇరువైపులా గ్రామాలు ఉన్న చోట డివైడర్లు ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల గ్రామాలు రోడ్డుకు దూరంగా ఉండడంతో డివైడర్లను ఏర్పాటు చేయలేదు. జాతీయ రహదారి కావడం వల్ల ప్రమాదాలు జరిగిన చోట్లలో రోడ్డుపై ఎలాంటి బారికేడ్లు ఏర్పాటు చేయలేమని పోలీసులు చెబుతున్నారు.

'వెంకటయ్య బావి' నవల ఆవిష్కరణ



వెంకటయ్య బావి నవలను ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి తదితరులు

హైదరాబాద్(లక్డీకాపూల్): వెంకటయ్య బావి నవలతో సాహిత్యంలో మూడు ప్రక్రియల్లో దాసరి మోహన్ సాధన చేస్తున్నారని నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నవలను ఆవిష్కరించి మాట్లాడారు. దండెం, అల్మారా కవితల సంపుటి, రాళ్ల కుచ్చె కథా సంపుటి రచించిన దాసరి సరికొత్త ఆవిష్కరణలు చేస్తున్నారన్నారు. మోహన్ తన నవలను అక్షర కౌముది సంస్థకు అంకితం చేయడం అభినందనీయమన్నారు. జంట నగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత రూప్‌కుమార్ డబ్బీకార్ పుస్తక పరిచయం చేశారు. కాంచనపల్లి గోవర్ధనరావు, పొత్తూరి సుబ్బారావు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, రమాదేవి కులకర్ణి, బెల్లంకొండ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కోదాడరూరల్ : తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని శ్రీమన్నారాయణ కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీమన్నారాయణ కాలనీలో నివాసం ఉండే మిర్యాల నాగేశ్వరరావు ఈ నెల 23న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి జగ్గయ్యపేట బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చేసేవరకు తాళం పగులకొట్టి ఇంట్లో ఉన్న ఐదు తులాల బంగారం, రూ.2.50లక్షల నగదు మాయమైనట్లు గుర్తించారు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రాణం తీసిన చేపల వల

- చెరువులో కాళ్లకు వల చిక్కుకోవడంతో నీటమునిగి మృతి



శ్రీ రాములు (ఫైల్)

వలిగొండ : చేపల వల ఓ వ్యక్తి ప్రాణం తీసింది. చెరువులో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కాళ్లకు చుట్టుకోవడంతో నీట మునిగి మృతిచెందాడు. వలిగొండ మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన పబ్బు శ్రీరాములు (65) వృత్తి రీత్యా చేపలు పట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం గ్రామంలోని మల్లసముద్రం కుంటలో చేపల పట్టడానికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు రెండు రోజుల పాటు మల్లసముద్రం పరిసరాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం మల్లసముద్రం కుంటకు వెళ్లి అందులో వేసి ఉన్న వలను లాగడంతో శ్రీరాములు విగతజీవుడిగా కనిపించాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

లునారెస్ అనలాగ్ ఆస్ట్రోనాట్ మిషన్‌కు ఎంపిక



మోహనసాయి

హుజూర్‌నగర్: పోలాండ్ దేశంలో జరిగే లునారెస్ అనలాగ్ ఆస్ట్రోనాట్ మిషన్‌కు భారతదేశం తరపున హుజూర్‌గనర్ పట్టణానికి చెందిన ఆకుల మోహనసాయి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం మోహనసాయి విలేకరులతో మాట్లాడుతూ.. లునారెస్ రీసెర్చ్ స్టేషన్ అనేది పోలాండ్‌లోని పోస్ట్ మిలిటరీ విమానాశ్రయంలో ఉందని, ఈ స్టేషన్‌లో అనలాగ్ ఆస్ట్రోనాట్లు బాహ్య ప్రపంచం నుంచి పూర్తిగా వేరు చేయబడతారని, ఛాంబర్ లోపల 15రోజుల పాటు వారి శరీర ధర్మం, మనస్తత్వ శాస్త్రం, మరికొన్ని సాంకేతిక పరీక్షలను నిశితంగా పరిశీలిస్తారని తెలిపాడు. మోహనసాయి ముంబై లోని అమిటీ యూనివర్సిటీలో మాస్టర్స్ (ఆస్ట్రోబయాలజీ అండ్ స్పేస్ సైన్స్) చదువుతున్నాడు. భారతదేశంలోనే ఈ కోర్సును తొలిసారిగా 2023లో ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కోర్సుకు సంబంధించి ఫస్ట్ బ్యాచ్‌లో 9మంది విద్యార్థులు ఉండగా.. తెలంగాణ నుంచి మోహనసాయి మాత్రమే ఉన్నారు. ఇలాంటి ఆస్ట్రోనాట్ మిషన్లలో పాల్గొంటున్న తనకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆర్థికసాయం అందించాలని మోహనసాయి కోరుతున్నాడు. మోహనసాయి ఎంపిక పట్ల తల్లిదండ్రులు శ్రీనివాస్ నాగజ్యోతి, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మెడికో మృతి



సాయితేజ (ఫైల్)

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మెడికో మృతిచెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన బిరుదు సాయితేజ(20) నార్కట్‌పల్లి కామినేని మెడికల్ కాలేజీలో బీడీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సాయితేజ తనతో కలిసి చదువుకుంటున్న యశస్వీతో కలిసి సోమవారం ఉదయం బైక్‌పై యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రానికి వెళ్లి మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో చిట్యాల వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను భువనగిరి వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా పడిన సాయి తేజ, యశస్విని పోలీసులు నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. సాయితేజ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు.

పురుగుల మందు తాగి బలవన్మరణం

నల్లగొండ క్రైం : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లగొండ పట్టణ సమీపంలోని పానగల్‌కు చెందిన లోకనబోయిన భిక్షపతి(56) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల సోదరుల మధ్య 70గుంటల భూమి విషయంలో తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మనస్తాపానికి గురైన భిక్షపత్తి మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. బయటికి వెళ్లిన భార్య పద్మ కాసేపటికి తిరిగి రాగా భిక్షపతి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దీంతో ఆమె ఇరుగు పొరుగు వారి సహాయంతో భిక్షపతిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం వివరాలు లభ్యం

- మృతుడు భువనగిరిలోని హనుమాన్ వాడ వాసి

భువనగిరి క్రైం : మండల పరిధిలోని భువనగిరి–పగిడిపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలపై సోమవారం లభ్యమైన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం వివరాలు తెలిశాయి. మృతుడి చేతిపై ఉన్న పచ్చబొట్టు ఆధారంగా భువనగిరి పట్టణంలోని హనుమాన్ వాడ వాసి గంగబోయిన మల్లయ్య(55)గా గుర్తించారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే మల్లయ్య కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. తీసుకున్న అప్పులు చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో మద్యానికి బానిసగా మారాడు. అప్పుల బాధతోనే గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.